# హిప్పీ నాటకం

—బలివాడ కాంతారావు

గోవా గాలి ఇంతుపించు రెండేళ్ళనించీ పీల్చు తున్నాము. త్వరలో బదిలీ తప్పదు. కానీ, మా ఆవిడ ఒక్క కోర్కె తీర్చడానికి సంశ యిస్తునే ఉన్నాను. ఇదివరకు రెండుసార్లు మా ఆవిడ అడిగితే ఒకసారి—'అక్కడ చూడ్డానికి ఏమీ లేదట' అని, ఇంకోసారి 'నువ్వు చూడలేవు' అని అన్నాను.

"నేను చూడలే నంటున్నారు. మీరు కాని నాతో చెప్పకుండా పోయి చూశారా?!"

"ఎప్పుడైనా అంత పని చేస్తానా?!"

నవంబరు నెల. కార్తీక పున్నమి రోజు—వెన్నెల్లో ఇంటి ముందు తిరుగుతూంటే నా మిత్రుడు ధనకర్, అతని భార్య మా ఇంటి వేపు వచ్చారు. ఇంట్లోకి వచ్చే బదులు—'వెన్నెల్లో కాలనీ చుట్టూ షికారుకు పద' అన్నాడు. పండు వెన్నెల్లో ప్రకృతి ప్రతి అవయువం కనుపుతూ పరుగెత్తుతున్న పడుచులా ఉంది. మగాళ్ళం ముందు నడుస్తూ ఆఫీసు కబుర్లు చెప్పుకుంటూంటే, ఆడవాళ్ళిద్దరూ మెల్లగా వెనక నడుస్తున్నారు. ఆవిడ చెపుతూంది. మా ఆవిడ వింటూంది. ఇద్దరూ నవ్వుకుంటున్నారు.

ఆవిడ ఏమి చెప్పిందో, ఏమిటో ఇంటికి తిరిగి వచ్చాక—

"రేపు ఆదివారం. తప్పక నన్ను తీసుకువెళ్ళండి" అంది.

"వాళ్ళను దర్శించక పోతే ముక్తి రాదా?"

"హిప్పీలను చూడకుండా నేను గోవానించి కదలను."

"ఆవిడ అంత గొప్పగా చెప్పిందా?"

"గోవానించి వచ్చావు. హిప్పీలను చూశావా? వాళ్ళ వింతలేమిటి? అని ఎవరైనా అడిగితే తెల్ల ముఖం వెయ్యదలుచుకోలేదు."

"చాలా దూరం."

"ఈ దూరాన్నీ ఇదివరకు చుట్టుముట్టి వచ్చారా? నిజం చెప్పండి."

"నీతో అబద్ధం ఎప్పుడైనా చెప్పానా?"

"నాకేం తెలుసు?"

"అబద్ధం ఆడితే ఏదో ఒక రోజు నిజం తెలుసు కునే ఉందువు. సరేగానీ, ఆవిడ ఏ బీచిలో హిప్పీలను చూసింది?"

"కోల్వా."

గబగబ నా దగ్గర ఉన్న టూరిస్టు కరపత్రం తీసి—"కోల్వా—మరగాం నించి ఆరు కిలోమీటర్లు. కలంగూట్‌కు మించిన ప్రశస్తికోథ. పశ్చిమ పవనాల తాకిడికి సన్నితంగా కదులుతున్న పచ్చని కొబ్బరి కొమ్మలను వడ్డాణంలా తగిలించుకుని, బంగారు చాయతో మైళ్ళ తరబడి అల్లుకున్న బీచి."

"అందులో ఉన్నదో, లేదో కానీ—మీ కవిత్వం చాలించి—రేపు పదండి. ఖర్చు అంతా నాది."

"మొన్న దీపావళికి చిచ్చుబుడ్డి కాలుస్తూ చెయ్యి కాల్చుకున్న సూర్యారావు అంకుల్‌ను మరగాంలో చూసి వస్తా"మని పిల్లలిద్దరితో అబద్ధం చెప్పి, ఆదివారం ఆరుగంటల నించి ఆరాటపడగా తొమ్మిదికి ఇల్లు కదలగలిగాము. మరగాంలో బస్సు దిగి పార్కు నించి రెండవవైపు కదిలి కోల్వా బస్సు పట్టుకున్నాము. మేము కూర్చున్న ముందు సీటులో ఒక తెల్లజంట కూర్చున్నారు. మా ఆవిడ మెల్లగా—"హిప్పీలు—హిప్పీలు" అని గొణిగింది.

"తెల్లగా ఉన్నదంతా పాలు, నల్లగా ఉన్నదంతా నీరు అంటున్నావు. అంత అమాయకంగా ఉంటే ఎలా?"


"మనవైపు నలుగురూ చూస్తున్నారు. మెల్లగా మాట్లాడండి. అదేమిటి? వాళ్ళు ఒకరినొకరు అలా పట్టి కూర్చుంటే హిప్పీలు కాదంటారు?" మళ్ళీ

"వాళ్ళు టూరిస్టులు. హిప్పీలు కారు. అలా కూర్చోవటం వాళ్ళ సంప్రదాయం. అలా కూర్చునే ముద్దెట్టుకోవటం కూడా వాళ్ళ సంప్రదాయం. ఎవరి సంప్రదాయం వాళ్ళు వదిలితే వెలివేసేయరూ?" ఇలా అంటూండగానే వాడు ఆమెను గట్టిగానే ముద్దెట్టుకున్నాడు పబ్లిక్‌గా! బస్సులో ఉన్న గోవన్లు పట్టింపు చేసుకోలేదు కానీ—మా ఆవిడ శరీరం వణకడం చూశాను.

"అలా ఆవేశపడి వణికిపోవద్దు ఇంకా నాటకం మొదలు కానిదే!" బస్సు బాగా నిండేవరకూ కదలలేదు. భావాకలాపం మొదలయ్యేముందు సూత్రధారి ధూపం వేసినట్లు అప్పుడే బస్సులో చేపల వాసన వేస్తూంది. చెవిలో రింగులాడిస్తూ చెమ్మా బట్టలు ఎత్తి కట్టి, చేపల్లాంటి నునుపు శరీరాలతో మత్స్యకన్యలు మాటాడుకుంటున్నారు.

అరవై పైసలు చార్జీతో ఈ ఆరు కిలోమీటర్లు అరగంటకు పైగా లంఘనాలు చేసుకుంటూ కోల్వా బీచి చేరుకున్నాము. మనసూ, కడుపూ చల్లబడాలని కొబ్బరి బొండాలు తాగి బీచిలో పడ్డాము. ఎదరగా ఎన్నో చేపల బోటులు బారులుతీరి కదులుతున్నాయి. ఆ మరబోటులు వదిలిన మురికి నూనె ఒడ్డు వరకూ ఈదుకుంటూ వచ్చింది.

"ఏరీ? హిప్పీ లెక్కడ?" మా ఆవిడకు ఆత్రుత గా



నించి బీచి అంతా స్పష్టంగా కనిపిస్తూంది. పది పాకలు మా వెనకకు ఉన్నాయి. ఒక పాక ముందు ఇద్దరు చేపల వలలు అల్లుకుంటున్నారు. ఇంకో పాకనించి హిప్పీలు నిలుచుని చూస్తున్నారు. కాస్సేపయ్యాక చల్లగాలికి చెమట ఆరి హాయిగా




ఉంది. హిప్పీలకన్నా వాళ్ళను చూడాలన్న ఆపేక్షతో వచ్చిన ప్రేక్షకుల సంఖ్య పెరిగిపోతూంది. వందల కొద్దీ యువకులు బీచిలో తిరుగుతున్నారు.

"నడవగలవా?"

"నడుస్తాను—ఎంత దూరమైనా నడుస్తాను."

"అయితే నా వెంటరా" అంటూ సముద్ర తీరం గుండా కదిలితే ఒక పడవ చాటున ఒడ్డునే ఒక పాశ్చాత్య వనిత—ముసలమ్మ — బైబిలు చదువు కుంటూంది. ఇంకా ముందుకు పోతే గోధుమ పిండి లాంటి ఇసుక పాన్పు మీద—ఎండు చేపలు ఎండలో మాడిపోతూ ముక్కును మూయిస్తున్నాయి.

అలా కదులుతూంటే మన దేశ యాత్రికులు ముమ్మరంగా గుమిగూడి ఉన్నారు.

"రంగంలోకి వచ్చాము.. కానీ, ఇక్కడ నిలుచుని ఈ హిప్పీ నాటకం చూడలేవు. స్నానముకు పోవాలి" అన్నాను. ఒకే చాప మీద బాహ్య ప్రపంచంతో తనకేమీ సంబంధం లేదన్నట్లు బేతింగ్ డ్రెస్‌తో ఒక చక్కని తెల్లని చిక్కని అమ్మాయి కూర్చుని చదువుకుంటూంది. ఆమె పక్కనించే నడిచిముందుకు పోయాము.

ఒడ్డున ఉన్న కొబ్బరితోట దగ్గరికి నడిచాము. నీడలో కూర్చున్నాము. ఆ తోట ఉన్న ఎత్తు ప్రదేశం

ఉంది. కొబ్బరి కొమ్మల కదలిక తప్పించి మరే శబ్దమూ లేదు. నీలి నీరు ఇంకా నురగలు కక్కటం లేదు. అందుకే సముద్రం నిశ్శబ్దంగా ఉందని పిస్తూంది. ఈ హిప్పీలు మన అతిథులు. వాళ్ళ వైపు నేను మింగినట్లు చూస్తే అమర్యాద. మా ఆవిడ అలా చూస్తే మర్యాద. ఆమె నాటక రంగం వైపు చూస్తూంది. ఆమె వైపు తిరిగి నేను కూర్చున్నా. క్రీగంటగా రంగంలో ఏమి జరుగుతున్నది చూస్తున్నాను.

ఒకటవ రంగం: ఒంటరిగా కూర్చున్నాడు ఒక శ్వేతముఖుడు.' ఎండను పట్టించుకోకుండా ఏమి చదువుకుంటున్నాడో రానురాను శరీరం కంది పోతూంది. సైలెంటుగా ఉన్న సాధువులా ఉన్నాడు. ఒక్కసారి లేచి పోయాడు. ఎందుకు? ఎందుకంత గాభరా? ఏమిటా ఆవేశం? వాడి ఎదరగా ఒక జంట కదిలిపోతున్నారు. ఆ జంటలో ఆమె వీనస్ విగ్రహంలా ఉంది. అతడు ఒలింపిక్ క్రీడాకారుడులా ఉన్నాడు. వాళ్ళను చూశాక ఈ శ్వేతముఖునికి ఇప్పుడు వేడెక్కిందేమో—నిప్పు సెగలు చుట్టుముట్టా యేమో, చప్పున పరుగెత్తి గంగలో దూకాడు.

"ఇందులో మన నాటకానికి హీరో, హీరోయిన్‌లు దొరికారు. వాళ్ళవైపు చూడు—ఎంత హుందాతో నడుస్తున్నారో?" అంటూ ఉంటే మా ఆవిడ దృష్టి నీటిలోనికి గెంతిన శ్వేతముఖుని వైపే ఉన్నది. అలా చూస్తూ చూస్తూ "ఛ ఛ!" అని కళ్ళు మూసుకుంది.

"కళ్ళు మూసుకుని వాడిని అలా అమర్యాద చెయ్యకు."

"అదేమిటండీ! వాడి కేం పోయేకాలం?"

"మన ఊరిలో మన అబ్బాయి ఏటిలో స్నానం చేసి, మన ఎదరగా ఒడ్డు మీద చెడ్డీ వేసుకోలేదా? ఈ హిప్పీలు చిన్న పిల్లల్లాంటివా రనుకో! తేడా? మనవాడు నలుపు—వీళ్ళు. . ."

"ఆపండి మీ వ్యాఖ్యానాలు" మా ఆవిడ నా నోరు కట్టేసింది.

రెండవ రంగం: మా ఆవిడ లేచి పోగానే ఆ సీను మారిపోయింది. ఈ నాటక రంగం చాలా విశాల మైనది. మొదటి నుంచి చివరి వరకూ చూడాలంటే ప్రేక్షకులే కదలాలి. ముందుకు కదులుతూంటే నేరేడు పండు రంగు పూలతో పచ్చని తీవలు కాళ్ళకు తగులుతున్నాయి. ఆ దగ్గరలో మళ్ళీ కొబ్బరి చెట్ల నీడల్లో కూర్చున్నాము. ఎదురుగా సముద్రంలో ఒలింపిక్ క్రీడాకారుడు, వీనస్ కలిసి రింగు విసురు కుంటూ ఆడుకుంటున్నారు.

"సీను కనిపిస్తూందా?" అని అడిగాను మా ఆవిడను.

"మధ్య ఆ రింగు ఎందుకూ?"

"ఏం చూస్తున్నావు నువ్వు? అసలు స్టేజి ఎక్కడుంది? నువ్వెక్కడ చూస్తున్నావు?"

"అదిగో — సముద్రంలో స్టేజి ఉంది. అటు వైపే దీక్షగా ఆ రాసలీలలు చూస్తున్నాను."

"ఇటు మనకు దగ్గరలో ఒడ్డు మీద— నలుగురు చాపల మీద దొర్లుతున్నారు. ఆ తెల్లని గుడ్డ కప్పుకున్న దెవరో?"




చాలాసేపటి వరకు మా సస్పెన్స్ చావలేదు. తరవాత ఆ గుడ్డ గాలికి ఎగిరిపోయింది. నలుగురూ ఒక్కలాగానే కనిపిస్తున్నారు. నలుగురి జుత్తూ జడలు వేసుకోవడానికి తగ్గట్లు పెరిగి ఉంది. నలుగురికీ గోచీలైనా ఉన్నట్టు మా కళ్ళకు ఆనలేదు. గాలి అటు వేపు వీస్తూంది కదా — ఒక్క మాట వినిపిస్తే ఒట్టు. కదలలేదు. ఒకరి నొకరు తగిలి కూర్చున్నారు. అటు సముద్రం వైపు చూస్తున్నారు.


“అదేమిటండీ — వాళ్ళలో వాళ్ళే ... బైరాగి బైరాగీ బాడిద వాటంలా ఉంది. పదండి, పోదాం.”

“చూడు—ఎంత సున్నితంగా వీపు నిమురుతున్నాడో!”

“సున్నితం ఆడవాళ్ళ సొత్తు. దానిని మగవాళ్ళకు అప్పచెప్పుతున్నారు!”

“చత్వారం వచ్చిందా?”

“గుడ్డలన్నీ విప్పేసి, ముగ్గురు మగాళ్ళ మధ్య నున్నది — అది ఆడదా? నేను నమ్మను.”



-వేణు-

“నీకు అనుమానంగా ఉంటే పద. వాళ్ళ ఎదరగా వెళదాం.”

“అమ్మ బాబోయ్! అదిగో, ఇటు తిరిగింది. ఆడదేనండోయ్! పదండి, పోదాం” అంటూ మా ఆవిడ లేచి పోయింది.

“ఇంకా రెండవ రంగంలోనే ఉన్నాము. పద ముందుకు” అంటూ ముందు నడిస్తే మా ఆవిడ మౌనంగా నా వెంట కదిలింది.

ఒడ్డున ఉన్న తీవలు, ముళ్ళను ముచ్చటగా పువ్వుల ఆకారంతో చూపిస్తున్నాయి. చిన్న చిన్న ముళ్ళు గాలికి కదిలి గుచ్చుకోవడానికి వస్తున్నాయి. వాటిని తప్పించుకుని బాగా ముందుకుపోయి రెండు కొబ్బరి చెట్లు ఒకదాని కొకటి తగిలి ఉంటే వాటి క్రింద కూర్చున్నాము. బీచినుంచి చూస్తే మేము సరిగ్గా కనపడం కానీ, బీచిలో ఏమి జరుగుతూందో బుర్రిబీ వేసి చూసినట్లు చూడగలుగుతున్నాము. ఇక మూడవ రంగం మొదలైంది.

మూడవరంగం: ఒలింపిక్ క్రీడాకారుడు, వీనస్ విగ్రహం ఈతా, ఆటా చాలించి, ఒడ్డున ఉన్న తమ సరంజామా పట్టుకుని, ఒకరి నొకరు బంధించు కుంటూ, అల్లుకున్న లతతో, కదులుతున్న చెట్టులా మా వైపే వస్తున్నారు. అక్కడే స్నానాలు చేస్తున్న ప్రేక్షకులు కూడా వేగిరం తమ తంతులు ముగించుకుంటున్నారు. మా దగ్గరలో ఒక చాప పరచుకుని చేతిసంచిలోని అరటిపళ్ళు, టమాటో పళ్ళు ఆరగిస్తున్నారు. మబ్బులు గొడుగై గాలి తేమతో బరువెక్కి ఇసుక పాన్పుపై పన్నీరు జల్లినంత హాయిగా ఉంది. కల్తీలేని ఈ అపురూపమైన ప్రకృతిని చూడగానే ఆవేశంతో, వారి చలిదేశపు కైటు బట్టలు విసిరేసి, సమ్మోహనులై వసంతంలో నృత్యం చేసే మయూరాల జంటలా గెంతుతున్నారు.

రంగం మీద ఈ నాట్య ప్రదర్శన తప్ప ఇంకేమీ జరగనట్లుంది. అంతలో ఒక్కసారి క్రీడాకారుని గొంతుక వినిపించింది. అది అరుపు కాదు. ఆక్రందన. ప్రేక్షకులే స్టేజి ఎక్కిపోతే ఇంకేం నాటకం సాగుతుంది?

“వాడేమిటి అలా పిచ్చి వాడిలా అరుస్తున్నాడు?” అంది మా ఆవిడ.

“వాడేమి అంటున్నాడంటే — పది నెలలు శ్రమపడి కూడవేసి, ఈ రెండు నెలలు ప్రశాంతంగా నా ప్రియురాలితో గడుపుదామని గోవా వచ్చాను. విమానం దిగిన నించీ ప్రతిక్షణం మీరు పెట్టిన కష్టాలూ, ఇబ్బందులూ, మోసాలూ అలా ఉంచి— ఇదేమిటి? మీరు మమ్మల్ని సర్కస్‌లో జంతువులను చేసి చూస్తున్నారు? అంత అందమైన మీ ఆడవాళ్ళను ఈ కోల్వాలోనే చూస్తే — మీ రెవరూ ఆ అందాలను పట్టించుకోరేం? మీకు తెలువంటె మక్కువ ఏమో? ఇవిగోనండి — ఈ సముద్రంలో నాకు గుచ్చుకున్న చేపముళ్ళు. తెల్లగా ఉన్నాయి. ముద్దెట్టుకోండి” అంటూ ఆ పెద్ద సొరచేప ముళ్ళు ప్రేక్షకులపై విసిరాడు.

ఆ హీరో అంతటితో ఆగక, మన హిందీ సూపర్ స్టార్‌లు, సూపర్ బడ్జెట్ ఫిల్ముల్లో హీరోయిన్‌ను అమాంతంగా సగం గుడ్డ విప్పి ఎత్తేసినట్లు వీనస్‌ను ఎత్తేసుకున్నాడు. సెన్సార్లకు జడిసి హిందీ ఫిల్ముల్లో చెయ్యని పనులన్నీ ఈ హీరో వెంటనే పబ్లిక్‌గా ప్రదర్శించగానే మా ఆవిడ — “పదండి. మన దేశం వెళిపోదాం” అని గబగబ [illegible] తిరుగు ప్రయాణం కట్టింది.

“ఇది మన దేశంలో ఒక భాగం” అన్నాను.

జవాబు లేదు. కాస్సేపు నడిచాక మనస్సు కుదుట పడిందేమో — “ఈ కళంకం చెరిపేయడానికి పెద్దలందరూ పూనుకున్నారు లెండి. ఎంతకాలమో ఈ నాటకం సాగదు” అంది.

నేను జవాబు చెప్పలేదు. బస్సుకోసం బయలుదేరాము. పన్నెండు దాటితే కాని బస్సు రాదట. కొబ్బరి చెట్టు క్రింద బీచిలో నిలుచున్నాము. చాయ్ కొట్టు దగ్గర హిప్పీలు కొందరికి గుడ్డలు సరిగా లేవు. కాళ్ళకు చెప్పులు లేవు. కొందరు ఆడ హిప్పీలకు కాళ్ళకు వెండి పట్టీలు. జడలు అల్లిన జుత్తుపై పువ్వులు. అద్దెకు తీసుకున్న సైకిళ్ళ మీద కొందరు, మోటారు సైకిళ్ళ మీద కొందరు. బీడీలు తాగుతున్న వాళ్ళెందరో. ఒక రకం డ్రెస్ కాదు. సంస్కారం ఎరగని జుత్తు. పెరిగిన గెడ్డాలు, మీసాలూ, తమాషాగా కనిపించే రూపులు. గట్టిగా మాటాడరు. శ్లోకాలు మెల్లిగా జపించుకుంటున్న సాధువుల్లా ఉన్నారు. ఎవరి వైపు వింతగా చూడరు, ప్రవర్తించరు. వాళ్ళ ధ్యాస వాళ్ళది. వాళ్ళ లోకం వాళ్ళది.

“వీళ్ళ దగ్గర ఉన్న ఆకర్షణ ఏమిటో?” అడిగాను మా ఆవిడను. ఆమె మాటాడకుండా పక్కనే ఉన్న కొబ్బరిచెట్టు పైకి చూస్తూంది. కల్లు ముంతను అమర్చి ఒకడు చెట్టు దిగుతున్నాడు. ఇంకొకడు ఆ పక్క చెట్టు నించి కొబ్బరి గెలలుదించుతున్నాడు. ఎండ తీవ్రత హెచ్చింది. కాస్సేపయ్యాక నాటకం ఈ వేళకు ముగిసిందేమో ప్రేక్షక మహాశయులు తండోపతండాలుగా తిరిగి వచ్చినడ్డారు. దేశంలో అన్ని భాషా ప్రాంతాలవారు ఉన్నారని వాళ్ళ మాటలే చెబుతున్నాయి. కొందరుబార్‌లో దూరారు. మరి కొందరు కొబ్బరి బోండాలు తాగుతున్నారు. అక్కడ ఉన్న చాయ్ దుకాణాలు, కిళ్లీ బడ్డీలు, లాడ్జీలు, టాక్సీలు — ఈ టూరిస్టు వ్యాపారం అంతా నడుస్తూందంటే —

“కారణం ఎవరు?”

“ఈ హిప్పీలే” అంది మా ఆవిడ.

“ఈ హిప్పీ నాటక రంగం లేకపోతే గోవా బతుకలేదు. ఈ కళంకాన్ని చెరిపేస్తానన్న వాళ్ళంతా నాలాంటి వాళ్ళే.”

“వాళ్ళతో పోల్చుకునే కర్మ మీ కెందు కొచ్చిందీ?”

“చేసిన పాపం చెబితే పోతుంది. హిప్పీలను తిట్టి మరీ వాళ్ళను చూడ్డానికి రెండుసార్లు ఒంటరిగా వెళ్ళాను. మరెప్పుడూ అబద్ధం ఆడనులే” అన్నాను.

అంతలో హిప్పీ నాటకంలోని నాయికా నాయకులు ఒకరి నడుము ఒకరు పట్టుకుని కాటేజి వైపు బేతింగ్ డ్రెస్ తోనే వెళ్ళిపోతూంటే బస్సుకోసం చూస్తే లాభం లేదని టాక్సీ ఎక్కేశాము. *